# యూనిట్ - 4

## నాటకం

సంక్షిప్త సమాధాన ప్రశ్నలు:-

1. **తెలుగు నాటక పరిచయం:-** తెలుగు సాహిత్యంలో ఉన్న కవిత్వం, వ్యాసం, నవల, కథానిక లాంటి ప్రక్రియల్లో 'నాటకం' ఒకటి. సంస్కృతం లోని దశరూపకాల్లో నాటకం ఉన్నా, ఇప్పుడున్న నాటకంతో సంబంధం లేదు. ఇది ఆధునిక ప్రక్రియ. నాటకంలో కథ, పాత్రలు ఉంటాయి. పాత్రలే కథను నడిపిస్తాయి. భారతీయులు 'నాటకాంతం హి సాహిత్యం' అని నాటకానికి ప్రాధాన్యం ఇచ్చారు. సంస్కృతంలో గొప్ప నాటకాలున్నా, ఎందుకో ప్రాచీనాంధ్ర సాహిత్యంలో నాటకం ఆదరణకు నోచుకోలేదు. ఆధునిక నాటకం ప్రజల మాధ్యమం. ఇది ప్రజల మనోభావాలకు, జీవన విధానానికి అద్దం పట్టింది.

నాటకంలో ఆరు ముఖ్యమైన అంశాలుంటాయని అరిస్టాటిల్ చెప్పాడు.

1. ఆఖ్యానం లేదా కథావస్తువు (Theme)
2. ఇతివృత్తం (plot)
3. పాత్రలు (Charactors)
4. భాష (Language)
5. శ్రావ్యత (Melody)
6. దృశ్యత్వం లేదా ప్రేక్షణీయత (Spectacle)

భారతీయ ఆలంకారికుడైన భరతముని కూడా ఈ అంశాలను చెప్పినారు. తెలుగులో నాటక రచన ప్రారంభ, వికాసాలను పరిశీలిస్తే, 19వ శతాబ్దంలో పాశ్చాత్యుల, పార్సీల నాటకరంగ ప్రభావంతో తెలుగు నాటకరంగం మొదలైనదని చెప్పుకోవచ్చు. తెలుగులో మొదటి నాటకం 1860 వ సంవత్సరంలో కోరాడ రామచంద్ర శాస్త్రి గారిచే రచించబడిన 'మంజరీ మధుకరీయము'. ఆ తరువాత సంస్కృతం, ఆంగ్లం నుంచి తెలుగులోనికి అనేక నాటకాలు అనువదించబడ్డాయి. తర్వాత తెలుగు నాటకం సమాజంలోని పరిణామాలను ఇతివృత్తాలుగా గ్రహించి, అంతర్జాతీయంగా, రచనలు - ప్రదర్శనలు - రెంటిలోనూ ప్రయోగాలను స్వీకరించి ప్రఖ్యాతి గాంచింది.

2. తెలుగు నాటకంలో అభ్యుదయ యుగం:-

1944 నుండి 1970 వరకు ఉన్న కాలాన్ని తెలుగు నాటకరంగ చరిత్రలో అభ్యుదయ యుగంగా భావిస్తారు. ఈ యుగానికి ఆత్రేయ గారు తెలుగు మార్గాన్ని నిర్దేశించారు. ఈ కాలంలో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది. ప్రజలలో యుద్ధభయం నశించి, జాతీయోద్యమ ప్రభావంతోను విద్యాభివృద్ధి వలన, పత్రికల వలన ప్రజల్లో ఎంతో మానసిక వికాసం పెరిగింది. 1944లో ఆంధ్ర నాటక కళాపరిషత్తును పునరుద్ధరించారు. ఇంకా 1944 లో ప్రజానాట్యమండలి అరసంకు అనుబంధంగా ఏర్పడింది. వీటి మూలాన అనేక నాటకాలు, నాటికలు పౌరాణిక, చారిత్రక, సాంఘిక, రాజకీయ ఇతివృత్తాలతో రచింపబడి ప్రదర్శనలు జరిగాయి. భారతదేశానికి 1947, ఆగస్టు 15 న స్వాతంత్ర్యం వచ్చాక ఆనాటి ప్రజల స్థితిగతులు, ఆలోచనా దృక్పథం - నాటకాల్లో ప్రతిబింబించాయి. ఈ దశలో ఆత్రేయ సామాజిక చైతన్య దృక్పథంతో నాటకాలకు శ్రీకారం చుట్టారు.

అభ్యుదయ యుగంలో ప్రజా చైతన్యమే ప్రేరణగా రాజకీయ, చారిత్రక, సాంఘిక నాటకాలు రచింపబడ్డాయి. కాంగ్రెసు విజయం, గాంధీయ విజయం - ఆనాటి రాజకీయ నాటకాలు. సక్కుబాయి, తారాశశాంకం - పౌరాణిక నాటకాలు. అశోక సామ్రాట్, ఛత్రపతి శివాజీ, అనార్కలి, రోషనారా, రాణాప్రతాప్ - ఇవి చారిత్రక నాటకాలు. ముందడుగు, మాభూమి, పేదరైతు, తిరస్కృతి, గాలిమేడలు, పల్లెపడుచు, కూలిరాజు, పాలేరు, ఆసామి వంటి సాంఘిక నాటకాలు రచింపబడ్డాయి. వీటితో పాటు అభ్యుదయ యుగంలో అనువాద నాటకాలు కూడా వచ్చాయి. పాలగుమ్మి పద్మరాజు తమిళం నుండి 'రక్తకన్నీరు' నాటకాన్ని అనువదించారు. నాగభూషణం ముఖ్యపాత్ర పోషించిన ఈ నాటకం వేలకొలదీ ప్రదర్శింపబడింది. 'నాటకం, వీలునామా, ఆకాశరామన్న' అనే అనువాద నాటకాలు బాగా ప్రాధాన్యాన్ని పొందాయి.

## 3. తెలుగు నాటకరంగంలో అద్యతన యుగం:

క్రీ.శ. 1981 నుండి 2000 సం॥ల వరకు ఉన్న కాలము తెలుగు నాటకరంగ చరిత్రలో అద్యతన యుగంగా పేరుపొందింది. దీనికి ఆధునికానంతర యుగము, సమకాలీక యుగము అని నామాంతరములు కలవు. 1981 నుండి తెలుగు నాటకరంగాన్ని కళాపరిషత్తులే ముందుకు నడిపించాయి. అందుకే ఈ కాలాన్ని నాటక కళాపరిషత్తుల యుగమని కూడా పిలవచ్చు. పట్టణాల్లో, పల్లెల్లో నాటక పోటీలు నిర్వహిస్తూ నాటకరంగానికి తగిన విధంగా సేవచేశాయి ఈ కళాపరిషత్తులు. ఈ కాలంలో సాహిత్యంలో వచ్చిన దళితవాదం, స్త్రీవాదం - వాటికి సంబంధించిన అనేక దృక్కోణాలు ఇతివృత్తాలుగా స్వీకరించి నాటకాలు రాశారు రచయితలు. ఇంకా సమాజంలో పెరిగిపోతున్న లంచగొండితనం, ఎన్నికల్లో ధనప్రాబల్యం, విద్య, వైద్యం, న్యాయం, పోలీసు వ్యవస్థల్లో అడుగంటిన విలువలు, కుటుంబ జీవనాలలో వచ్చిన మార్పులు, ధనసంపాదనే ధ్యేయంగా విద్యావంతులు విదేశాలకు వెళ్ళడం, వాళ్ళు ఎదుర్కొనే సమస్యలు, స్వదేశంలో వారి కుటుంబాల పరిస్థితులు - ఇవన్నీ ఇతివృత్తాలుగా రచయితలు నాటకాలు రాశారు.

నాటక కళాపరిషత్తులు నిర్వహించే పోటీల వల్ల నాటకాల రచన పెరిగింది. కె. చిరంజీవి 'నీలిదీపాలు'; వి. యస్. కామేశ్వరరావు 'ఉదయమార్తాండుడు'; అత్తిలి కృష్ణారావు 'తూర్పురేఖలు'; దాడి వీరభద్రరావు 'దేవాలయాల మీద బూతు బొమ్మలు'; పాటిబండ్ల ఆనందరావు 'నిషిద్ధాక్షరి'; తారకరామారావు 'భాసుర'; వంటి నాటకాలు బాగా పేరు గాంచాయి. అలాగే తనికెళ్ళ భరణి 'గోగ్రహణం'; కె.కె.ఎల్. స్వామి 'తేనెటీగలు పగబడతాయి'; యం. జయప్రకాష్ 'గారడి'; దివాకర్ బాబు 'కుందేటి కొమ్ము'; డి. సుధాకర్ 'ఒంటికాలి పరుగు'; శంకరమంచి పార్థసారథి 'వాళ్ళకి వాళ్ళే' వంటి నాటకాలు ఈ యుగంలో బాగా పేరు గాంచినాయి. అనేకమంది నాటక కర్తలు, నాటకరచయితలు తమ రచనలతో నాటక రంగాన్ని పుష్టివంతం చేశారు.

<u>వ్యాసరూప ప్రశ్నలు:-</u>

1. తెలుగు నాటక పరిణామాన్ని, వికాసాన్ని వివరించండి.

జ:॥ ఆధునిక సాహిత్యప్రక్రియల్లో ఒకటి నాటకం. నాటకంలో కథ, పాత్రలు ఉంటాయి. పాత్రలే కథను నడిపిస్తాయి. ప్రాచీన తెలుగు సాహిత్యంలో నాటకానికి ప్రముఖస్థానం లేకపోయినా 19వ శతాబ్దిలో పాశ్చాత్య, పార్సీ నాటకప్రభావంతో తెలుగు నాటకం ఆరంభమయింది. తెలుగు నాటక పరిణామాన్ని, వికాసాలని విమర్శకులు ఆరు దశలుగా విభజన చేశారు.

1. <u>ఆరంభదశ</u>:- తెలుగులో కోరాడ రామచంద్రశాస్త్రి రచించిన 'మంజరీ మధుకరీయము' మొట్టమొదటి నాటకము. ఇది 1860లో రచింపబడింది. తర్వాత అనేక అనువాద నాటకాలు వచ్చాయి. కొక్కొండ వెంకటరత్నం పంతులు సంస్కృతం నుంచి 'నరకాసుర విజయ వ్యాయోగము', వావిలాల వాసుదేవశాస్త్రి ఆంగ్లం నుంచి షేక్స్పియర్ 'జూలియస్ సీజర్' నాటకాన్ని; ఒక సాంఘిక నాటకాన్ని సంస్కృతం నుండి భవభూతి ఉత్తర రామ చరిత్రను అనువాదం చేశారు. కందుకూరి సంస్కృతాంగ్ల భాషల నుండి అనువదించిన <u>రత్నావళి</u>, <u>అభిజ్ఞాన శాకుంతలం</u> చమత్కార రత్నావళి అనే నాటకాలతో రెండు నాటకాలు ప్రదర్శింపబడినాయి. తెలుగులో ప్రహసనమనే ప్రక్రియకు ఆద్యులు కందుకూరే. ఈ యుగంలో రాయలసీమలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు నాటకకర్తలుగా ప్రసిద్ధులు. ధర్మవరం వారు 'ఆంధ్ర నాటక పితామహులు'గా, కోలాచలం వారు 'ఆంధ్ర చారిత్రక నాటక పితామహులు'గాను ఖ్యాతి గాంచారు. ధర్మవరం వారి 'సారంగధర' తెలుగులో మొట్టమొదటి విషాదాంత నాటకంగా ప్రసిద్ధి పొందింది. చిలకమర్తి, పానుగంటి, ధర్మవరం, కోలాచలం మొదలైన వారి రచనల్లో భక్తి, హాస్యరసం, సంఘసంస్కరణ దృక్పథం అంతర్లీనంగా ఉంటుంది.

2. <u>వికాసదశ</u>:- ఈ యుగంలోని నాటకాల్లో జాతీయోద్యమం, సంఘసంస్కరణ దృక్పథం, హేతువాద దృక్పథం ప్రబలడం, ప్రజల్లో చైతన్యాన్ని, నూతనోత్తేజాన్ని తీసుకురావడం లాంటి విషయాలు ప్రతిబింబించాయి. 1897వ సం॥ము గురజాడ అప్పారావు సామాజిక ప్రయోజనాన్ని ఆశించి రచించి న

కన్యాశుల్కం, వేదం వెంకటరాయ శాస్త్రి గారి 'ప్రతాపరుద్రీయము' వంటి నాటకాలు రచింపబడి, ప్రదర్శింపబడటం విశేషం. తిరుపతి వేంకటకవుల 'పాండవోద్యోగవిజయాలు', బలిజేపల్లి 'హరిశ్చంద్ర' నాటకాలు ప్రదర్శింపబడి విశేషాదరణ పొందాయి. త్రిపురనేని రామస్వామి చౌదరి హేతువాద దృష్టితో, కాళ్లకూరి నారాయణ రావు సంఘ సంస్కరణ దృష్టితో, దామరాజు పుండరీకాక్షుడు దేశభక్తి సమ్మేళనంతో నాటక రచన గావించారు. దువ్వూరి రామిరెడ్డి, విశ్వనాథ, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, ఉన్నవ లక్ష్మీనారాయణ గొప్ప నాటకాల రచన గావించారు.

③ వైవిధ్య దశ :- నాటక రచనలోనూ, ప్రయోగాలలోనూ, వైవిధ్యం కలిగిన దశ ఇది. నాటక రంగంలో స్వభావ వాదం ఉండాలని నాటక ఇతివృత్తాలు సాంఘికంగా ఉండాలని, స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించాలని, పద్యాలను భావయుక్తంగా చదవాలని బళ్ళారి రాఘవ చేసిన సూచనలను, సంస్కరణలను 1929లో ఏర్పడిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఆమోదించింది. ఈ ఆలోచనలతో పి.వి రాజమన్నార్ 'తప్పెవరిది' అనే నాటకాన్ని రచించి ప్రదర్శించి విజయాన్ని పొందారు. ఈ దశలో పద్య నాటకాలు వెనుకబడి హేతువాదం దేశభక్తి, చారిత్రాలకు చెందిన నాటకాలు వచ్చాయి. మార్క్స్, ఫ్రాయిడ్ సిద్ధాంతాలతో చలం, రాజమన్నారు, ముద్దు కృష్ణ, జి.వి కృష్ణారావు, నార్ల వెంకటేశ్వర రావు మొదలైన వారు నాటకాలు రచించారు.

④ అభ్యుదయ దశ :- ఈ దశనే కొంతమంది స్వర్ణయుగం అని కూడా పిలిచారు. ఈ దశలో తెలుగు నాటక రంగానికి మార్గ నిర్దేశకుడు ఆత్రేయ. రెండవ ప్రపంచయుద్ధం ముగింపు జాతీయోద్యమ ప్రభావం, విద్యాభివృద్ధి, పత్రికలు :- ఈ కారణాల వల్ల ప్రజలు చైతన్య వంతులు అయ్యారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు పునరుద్ధరణ ప్రజానాట్య మండలి స్థాపన వల్ల సాంఘిక, పౌరాణిక, చారిత్రిక, రాజకీయ ఇతివృత్తాలతో నాటకాల రచన సాగింది. సామాజిక చైతన్య దృక్పథంలో

ఆత్రేయ నాటక రచన చేశారు. ఈ దశలో కాంగ్రెస్ విజయం, గాంధీ విజయం వంటి రాజకీయ నాటకాలు, సక్కుబాయి, తారాశశాంకం వంటి పౌరాణిక నాటకాలు, అశోక సమ్రాట్, ఛత్రపతి శివాజీ, అనార్కలీ, రోషనార, రాణా ప్రతాప్ వంటి చారిత్రిక నాటకాలు 'ముందడుగు' మా భూమి, పేదరైతు, గాలి మేడలు, పల్లెపడుచు, కూలి రాజు, పాలేరు లాంటి సాంఘిక నాటకాలు వెలువడ్డాయి. కొన్ని అనువాద నాటకాలు కూడా వచ్చాయి.

⑤ <u>ఆధునిక ధోరణులు</u> :- పాశ్చాత్య నాటక ప్రభావంతో తెలుగు నాటకంలో అనేక మార్పులు వచ్చాయి. 1970లో విప్లవరచయితల సంఘం ఏర్పడింది. ధనం, కులం సమాజంలో ప్రధానపాత్ర పోషించాయి. అంతర్జాతీయ నాటక రంగంలో కూడా అనేక మార్పులు వచ్చాయి. ఈ సందర్భంలో ఎంతోమంది నాటక కర్తలు నాటక రచన చేసి ప్రయోగాలు నిర్వహించారు.

⑥ <u>అధునాతన యుగం</u> :- ఈ యుగాన్ని అధునాతన యుగమని, సమకాలీక యుగమని అంటున్నారు. 1981 నుంచి తెలుగు నాటక రంగం పట్టణాల్లో, పల్లెల్లో, పోటీలు నిర్వహిస్తూ నాటక రంగాన్ని బతికించాయి. స్త్రీవాదం, దళిత వాదాలు ఈనాటి దృశ్య రచనల్లో ఇతివృత్తాలుగా తీసుకోబడ్డాయి. లంచగొండితనం ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యం, విద్య, వైద్య, న్యాయ, పోలీసు వ్యవస్థల్లోని దిగజారుడుతనం విద్యావంతులు ధనార్జనకోసం విదేశాలకు వెళ్లడం, దాని పరిణామాలు - ఇలాంటివన్నీ నాటక ఇతివృత్తాలయ్యాయి.

ఈ విధంగా తెలుగు నాటకరంగం దినదిన ప్రవర్ధమానమౌతూ రచన, ప్రయోగాల్లో గొప్పతనాన్ని సాధించింది.